క్లుప్తంగా

గ్రామాల్లో పారిశుధ్య పనులు



చెత్తను తొలగిస్తున్న సిబ్బంది

దుంబ్రిగుడ: మండల కేంద్రంతో పాటు పలు గ్రామాల్లో జోరుగా పారిశుధ్య పనులు చేపడుతున్నారు. గత రెండు రోజులుగా స్థానిక పెట్రోల్ బంకుతో పాటు పలు వీధుల్లో పేరుక పోయిన చెత్త, వ్యర్థాల తొలగింపు పనులను చేపడుతున్నట్టు పంచాయతీ కార్యదర్శి విజయ్ కుమార్ చెప్పారు. ఉన్నతాధికారుల ఆదేశాల మేరకు మండలంలో ముమ్మరంగా పారిశుధ్య పనులు చేపడుతున్నట్టు ఆయన తెలిపారు.

పాలిథిన్‌ను నిషేధించాలి



వారపు సంతలో వ్యాపారులకు నోటీసులు ఇస్తున్న ఎంపీడీవో ఉమామహేశ్వరరావు

గూడెంకొత్తవీధి: వారపుసంతలు, దుకాణాల్లో వ్యాపారులు పూర్తిగా పాలిథిన్ సంచుల విక్రయాలను నిలిపివేయాలని ఎంపీడీవో ఉమామహేశ్వరరావు అన్నారు. మండల కేంద్రంలోని వారపు సంతలో పాలిథిన్ నిషేధంపై వ్యాపారులు, గిరిజనులకు గురువారం అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ నిబంధనలు అతిక్రమించి పాలిథిన్‌ను సంచులను విక్రయిస్తే , జరిమానా విధిస్తామన్నారు. అనంతరం వ్యాపారులకు నోటీసులిచ్చారు.

అందుబాటులో ఇంటర్ పాఠ్యపుస్తకాలు



జూనియర్ కళాశాలలో పాఠ్యపుస్తకాల స్టాక్

అడ్డతీగల: ఇంటర్మీడియట్ ద్వితీయ సంవత్సరం విద్యార్థులకు పాఠ్యపుస్తకాలు అందుబాటులోకి వచ్చినట్టు అడ్డతీగల ఎస్ఏసీఆర్ ప్రభుత్వ జూనియర్ కళాశాల ప్రిన్సిపాల్ సున్నం రాజేంద్రస్వామి తెలిపారు. కళాశాలలో 149 మంది విద్యార్థులకు మొదటి విడతగా ఇంగ్లీషు, తెలుగు పాఠ్యపుస్తకాలు, నోటు పుస్తకాలు వచ్చాయన్నారు. శుక్రవారం నుంచి విద్యార్థులకు అందజేస్తామన్నారు. మిగిలిన పాఠ్యపుస్తకాలు కూడా త్వరలో సరఫరా జరుగుతుందని ఉన్నతాధికారులు తెలియజేశారన్నారు.

ప్రజా సమస్యలపై న్యాయ పోరాటం



పార్టీ జెండాను ఎగురవేస్తున్న సీపీఎం నేతలు

అరకులోయటౌన్: ప్రజా సమస్యలపై సీపీఎం నిరంతరం న్యాయ పోరాటం చేస్తోందని పార్టీ జిల్లా కార్యదర్శి వర్గ సభ్యుడు వి.ఉమామహేశ్వరరావు అన్నారు. సీపీఎం జాతీయ మహాసభలు మదురైలో జరుగుతున్న నేపథ్యంలో మండల కేంద్రంలోని పార్టీ నాయకులతో గురువారం సమావేశం నిర్వహించారు. పార్టీ జెండాను ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ దేశంలో విద్య, వైద్యం సామాన్యులకు అందుబాటులో లేదని, నిరుద్యోగ శాతం పెరిగిందన్నారు. ప్రశ్నించే లౌకిక శక్తులపై మతోన్మాద శక్తుల భౌతిక దాడులు పెరుగుతున్నాయన్నారు. మహిళలపై అత్యాచారాలు రోజురోజుకు ఎక్కువ అవుతున్నట్టు చెప్పారు. ఆర్థిక అసమానతల కారణంగా దేశం సంక్షోభంలో కూరుకుపోయిందన్నారు. సీపీఎం ప్రజా సమస్యలపై నిరంతరం పోరాడుతుందన్నారు. నాయకులు హరి, జగన్నాథం , చినబాబు, రామన్న, కోగేశ్వరరావు, నానిబాబు, బాలకృష్ణ తదితరులు పాల్గొన్నారు.

6న బీజేపీ ఆవిర్భావ దినోత్సవం



మాట్లాడుతున్న శాంతకుమారి

పాడేరు రూరల్: మండల కేంద్రంలో బీజేపీ జిల్లా అధ్యక్షురాలు ఎం.శాంతకుమారి ఆధ్వర్యంలో పార్టీ సమావేశం గురువారం జరిగింది. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ పార్టీ ఆవిర్భావ దినోత్సవాన్ని ఈనెల 6న నిర్వహిస్తున్నట్టు చెప్పారు. గ్రామాల్లో వేడుకలను ఘనంగా చేసేలా ఏర్పాట్లు చేయాలన్నారు. నాయకులు రామకృష్ణ, ఉమామహేశ్వరరావు, వేమన్న, గోపాలపాత్రుడు, సత్యవతి, మహేష్ తదితరులు పాల్గొన్నారు.

నిర్లక్ష్యానికి నిదర్శనం



దుంబ్రిగుడ పీహెచ్‌సీ సమీపంలో శిథిలావస్థలో ప్రభుత్వ భవనాలు



గుంటసీమలో శిథిలావస్థలో ఆశ్రమ పాఠశాల ఉపాధ్యాయుల క్వార్టర్స్

- శిథిలావస్థలో ఉపాధ్యాయుల క్వార్టర్లు
- నిరుపయోగంగా సబ్ సెంటర్లు, పాఠశాల భవనాలు



సంతవలసలో శిథిలావస్థలో ఎంపీపీ పాఠశాల భవనం



కిల్లోగుడ సమీపంలో నిరుపయోగంగా సబ్‌సెంటర్



జాంగుడలో నిరుపయోగంగా ఉపాధ్యాయుల క్వార్టర్స్

దుంబ్రిగుడ: మండలంలోని ప్రాథమిక ఆరోగ్య కేంద్రం సమీపంలో ఉన్న రెండు భవనాలు పూర్తిగా శిథిలావస్థకు చేరుకుని నిరుపయోగంగా ఉన్నాయి. గతంలో ఈ భవనాల్లో పాఠశాలను నిర్వహించే వారు. అయితే ఆ భవనాలు ప్రస్తుతం పూర్తిగా శిథిలావస్థకు చేరి తుప్పలు పెరిగి అధ్వానంగా ఉన్నాయి. కిల్లోగుడ ప్రాథమిక ఆరోగ్య కేంద్రానికి సమీపంలోని కొర్రాయి పంచాయతీకి చెందిన ఆరోగ్య ఉప కేంద్ర భవనాన్ని నిర్మించారు. ప్రస్తుతం ఈ భవనం కూడా నిరుపయోగంగా దర్శనమిస్తుంది. కిల్లోగుడలోనే ప్రాథమిక ఆరోగ్య కేంద్రం ఉండగా సమీపంలోని శరత్‌నగర్‌లో మరో ఆరోగ్య ఉప కేంద్రాన్ని ఏర్పాటుచేశారు. దీంతో ఈ సబ్‌సెంటర్ భవనం ప్రస్తుతం ఉపయోగంలో లేదు. ఈ విషయమై జిల్లాస్థాయి అధికారులు స్పందించి ఆయా ప్రాథమిక ఆరోగ్య కేంద్రాల్లో వృథాగా ఉన్న శిథిలావస్థ భవనాలకు మరమ్మతులు చేపట్టి ఉపయోగంలోకి తీసుకురావాలని కోరుతున్నారు.

కానరాని తలుపులు, కిటికీలు

గుంటసీమ బాలుర ఆశ్రమ పాఠశాల, దుంబ్రిగుడ మండల కేంద్రంలోని బాలుర ఆశ్రమ పాఠశాల, నందివలస బాలికల ఆశ్రమ పాఠశాల, జాంగుడ బాలికల ఆశ్రమ పాఠశాలలో ఉపాధ్యాయుల కోసం గతంలో నిర్మించిన ఉపాధ్యాయుల క్వార్టర్లు పూర్తిగా పాడై శిథిలావస్థకు చేరాయి. ప్రస్తుతం తలుపులు, కిటికీలు లేకుండా ఉన్నాయి. సంతవలసలో ఉన్న ఎంపీపీ పాఠశాలను సమీప దుంబ్రిగుడ ఎంపీపీ పాఠశాలలో విలీనం చేయడంతో ఆ పాఠశాల భవనం పూర్తిగా పాడైపోయి శిథిలదశకు చేరింది. దుంబ్రిగుడలో ఉన్న ఉపాధ్యాయుల క్వార్టర్స్‌ను పూర్తిగా తొలగించారు. దీంతో ఆయా ఆ పాఠశాలలో ఉపాధ్యాయులు స్థానికంగా ఉండకుండా అరకులోయ, పాడేరు, దుంబ్రిగుడలలో నివాసం ఉంటున్నారు. ఉన్నతాధికారులు స్పందించి పాత పాడైపోతున్న భవనాలకు మరమ్మతులు చేసి వినియోగంలోకి తీసుకురావాలని పలువురు కోరుతున్నారు.

చర్యలు తీసుకుంటాం

గతంలో ఐటీడీఏ పీవో దృష్టికి ఉపాధ్యాయుల క్వార్టర్స్ సమస్యలను తీసుకెళ్లాం. ఐటీడీఏ పరిధిలోని ఆశ్రమ పాఠశాలలతో పాటు ఉపాధ్యాయుల క్వార్టర్స్ మరమ్మతులకు అంచనా వేసి ప్రతిపాదనలు పంపుతాం. సమస్యను మరోసారి ఉన్నతాధికారుల దృష్టికి తీసుకెళ్లి క్వార్టర్స్ మరమ్మతులు చేసేందుకు చర్యలు తీసుకుంటాం.

–మల్లికార్జున్, ఏటీడబ్ల్యూవో, అరకులోయ, దుంబ్రిగుడ

ఏడుగురు పేకాటరాయుళ్లు అరెస్టు

రాజవొమ్మంగి: మండలంలోని సూరంపాలెం శివారులోని పేకాట ఆడుతున్న ఏడుగురు వ్యక్తులను పట్టుకొని అరెస్టు చేసినట్టు ఎస్ఐ నరసింహమూర్తి గురువారం తెలిపారు. వారి నుంచి రూ.18, 680 నగదు, 52 పేక ముక్కలు స్వాధీనం చేసుకొన్నామన్నారు. ఈ దాడిలో పట్టుబడిన వారిలో సూరంపాలెం, రాజవొమ్మంగి గ్రామాలకు చెందిన వ్యక్తులు ఉన్నట్టు చెప్పారు.

గ్రామాల్లో తాగునీటి సమస్య ఉంటే కార్యదర్శులపై చర్యలు



సమావేశంలో మాట్లాడుతున్న ఎంపీడీవో విశ్వనాథ్

మారేడుమిల్లి: మండలంలో ఎక్కడైనా తాగునీటి సమస్య ఉంటే సంబంధిత కార్యదర్శులపై పంచాయతీ కార్యదర్శులపై చర్యలు తీసుకుంటామని మారేడుమిల్లి ఎంపీడీవో తూతిక శ్రీనివాస్ విశ్వనాథ్ హెచ్చరించారు. మండలంలో తాగునీటి సరఫరాపై పంచాయతీ కార్యదర్శులతో గురువారం వీడియో కాన్ఫరెన్స్ ద్వారా సమీక్షించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ గ్రామాల్లో ఎక్కడ తాగునీటి సమస్య లేకుండా కార్యదర్శులు చర్యలు తీసుకోవాలన్నారు. తాగునీటి బోర్లు పనిచేసేలా చూడాలన్నారు. గ్రామాల్లో తాగునీటి సమస్యపై ఎంపీడీవో కార్యాలయంలో ప్రత్యేక సెల్ ఏర్పాటు చేశామని 6300035669కు ఫోన్ చేయవచ్చన్నారు. తాగునీటి సమస్యలపై పత్రికల్లో వచ్చిన వార్తలపై వెంటనే స్పందించి, పరిశీలించి చర్యలు తీసుకోవాలన్నారు. ఏఓ రత్నకుమారి, విజయ్ తదితరులు పాల్గొన్నారు.

వైఎస్సార్‌సీపీ మండల కమిటీల నియామకం



అరకులోయటౌన్/హుకుంపేట/దుంబ్రిగుడ/పెదబయలు/అనంతగిరి(అరకులోయ టౌన్): వైఎస్సార్‌సీపీ మండల పార్టీ కమిటీ ఉపాధ్యక్షులు, ప్రధాన కార్యదర్శులు, కార్యదర్శుల, కార్యవర్గ సభ్యుల నియామకాలను పార్టీ అధినేత వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ఆదేశానుసారం అధిష్టానం ప్రకటించింది. ఇందులో భాగంగా అరకులోయ నియోజకవర్గంలోని అరకులోయ, అనంతగిరి, హుకుంపేట, డుంబ్రిగుడ, పెదబయలు మండలాల పార్టీ కమిటీల ప్రకటనను గురువారం విడుదల చేశారు. ఈ మేరకు అరకులోయ మండల వైఎస్సార్‌సీపీ ఉపాధ్యక్షులుగా గుడివాడ ప్రకాష్, పల్టాసింగి విజయ్‌కుమార్, జనరల్ సెక్రటరీగా సూకూరు సానియా, నందుల స్వామి, బురిడి రాము, కిల్లో ప్రసాద్, కార్యదర్శులుగా కొర్రా రమేష్, గరం పూర్ణచందర్, కురుడ బోయిన జీనబందు, శిరగాం అప్పన్న, శోబోయి రాంమూర్తితో 24 మంది కార్యవర్గ సభ్యులను నియమించారు.

- అనంతగిరి మండల వైఎస్సార్‌సీపీ ఉపాధ్యక్షులుగా పాడి కృష్ణమూర్తి, శెట్టి సింహాచలం, ప్రధాన కార్యదర్శులుగా దోనేరు దానియేలు, పాంగి కోగేశ్వరరావు, కొర్రా లక్ష్మణరావు, కార్యదర్శులుగా శిరగాం బిమల, కోటపర్తి పోలయ్య, కిముడు సుబ్బారావు, శిరగాం రాజు, మజ్జి గంగన్నతో పాటు 24 మంది కార్యవర్గ సభ్యులను నియమించారు.
- హుకుంపేట మండల వైఎస్సార్‌సీపీ ఉపాధ్యక్షులుగా కాకారి వెంకటరావు, గోమంగి చిన్నేశ్వరరావు, , ప్రధాన కార్యదర్శులుగా కిల్లో శాంబన్న, బడ్నాయిని బొంజుబాబు, వల్ల సాయి ప్రసాద్, గడ్డంగి సూరిబాబు, కార్యదర్శులుగా పాంగి వెంకటేశ్వరరావు, కాంగు కృష్ణారావు, గెమ్మెలి చిట్టిబాబు, బేతకారి మత్స్యరాజు, జి. సాల్మాన్‌రాజుతో పాటు 43 మంది కార్యవర్గ సభ్యులను నియమించారు.
- డుంబ్రిగుడ మండల వైఎస్సార్‌సీపీ ఉపాధ్యక్షులుగా అగతంబిడి గణపతి, పొట్టాంగి రామ్‌ప్రసాద్, ప్రధాన కార్యదర్శులుగా బురిడి లీలరాణి, పాంగి ధనుర్జయ్, మజ్జి రామ్మూర్తి, పాంగి దామోదార్, కార్యదర్శులుగా హరిబారికి రామునాయుడు, తర్మంగి కోటిబాబు, రాంబాయి త్రినాథ్, వంతాల మోహన్‌రావుతో పాటు 18 మందికి కార్యవర్గంలో చోటు కల్పించారు.
- పెదబయలు మండల వైఎస్సార్‌సీపీ ఉపాధ్యక్షులుగా పల్టాసింగి విష్ణుమూర్తి, జంబు పూర్ణయ్య, ప్రధాన కార్యదర్శులుగా చిట్టపులి అన్నపూర్ణ, కొర్రా విశ్వనాథం, పోయిభ కృష్ణారావు, కార్యదర్శులుగా పండా సుబ్రహ్మణ్యం, వల్లంగి సోంబాబు, చిక్కుడు సూరిబాబు, వంతాల కమలాకర్, బొంగరం నాగం నాయుడుతో పాటు 23 మంది కార్యవర్గ సభ్యులను నియమించారు. ఆయా మండలాల కమిటీ ప్రతినిధులకు పలువురు అభినందనలు తెలిపారు

వాణిజ్య పంటల సాగుతో లాభాలు



గిరిజన రైతులకు అవగాహన కల్పిస్తున్న వ్యవసాయ అధికారి శ్రీనివాసరావు

చింతపల్లి: మండలంలోని బలపం పంచాయతీ పరిధిలోగల బలపం, కోరుకొండ, చెరువూరు, జోహార్ తదితర గ్రామాల్లో మండల వ్యవసాయాధికారి శ్రీనివాసరావు గురువారం పర్యటించారు. వాణిజ్య పంటల సాగుపై అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ గంజాయి సాగు, రవాణా చట్టరీత్యా నేరమని వాటికి దూరంగా ఉండాలని సూచించారు. కాఫీ, పసుపు, మిరియాలు తదితర వాణిజ్య పంటల సాగుపై దృష్టి సారించాలని సూచించారు. ఉద్యాన పంటలైన అవకాడో, సపోటా, సిల్వర్‌ఓక్, నిమ్మ, జామ తదితర మొక్కలను పంపిణీ చేస్తున్నామని, వీటిని రైతులు సాగు చేసి ఆర్థికాభివృద్ధి సాధించాలని కోరారు. కార్యక్రమంలో వ్యవసాయ శాఖ సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

మే 4 నుంచి మత్స్యమాడుగులమ్మ తల్లి ఉత్సవాలు



ఉత్సవ కమిటీ సభ్యులు

జి.మాడుగుల: మత్స్యమాడుగులమ్మ తల్లి జాతర మహోత్సవాలు మే 4 నుంచి 6వ తేదీ వరకు మూడు రోజుల పాటు ఘనంగా నిర్వహించేందుకు గ్రామ పెద్దలు నిర్ణయించారు. ఈ ఉత్సవాలు నిర్వహించేందుకు నూతన కమిటీ నియామకం గురువారం జరిగింది. ఉత్సవ కమిటీ అధ్యక్షుడిగా ఎం.రామరాజు, ప్రధాన కార్యదర్శిగా జి.రెడ్డిబాబు, గౌరవ అధ్యక్షులుగా ఎం.బాలరాజు, ఎం.మణికుమారి, వరహాలరాజు, జెడ్పీటీసీ డాక్టర్ ఎం.వెంకటలక్ష్మి, సర్పంచ్ కె.రాంబాబు, ఎంపీటీసీ ఎం.విజయకుమారి, మాజీ ఎంపీపీ వరహాలమ్మ, ఎం.మత్స్యరాజు , ఉపాధ్యక్షులుగా మాజీ ఎంపీపీ వెంకట గంగరాజు, నాగరాజు, సింహాచలంరాజు, లక్ష్మీపతి రాజు, కె.సింహాచలం, కోశాధికారిగా ఎం.మత్స్యరాజు(ఎస్ఎస్ఎఫ్), సహాయ కోశాధికారిగా వి.శ్రీనివాసరావు, సలహాదారులుగా ఎం.భగవాన్ రాజు, కిముడు కోటేశ్వరరావు, ఎం సత్యనారాయణరాజు, గణేష్‌రాజు తదితరులను నియమించారు. ఉద్యోగులు, వ్యాపారులు, గ్రామస్తులు పాల్గొన్నారు.

గ్రామస్తుల సహకారంతో భారీ చెట్టు తొలగింపు



తెప్పలమామిడి సమీపంలో రోడ్డుకు అడ్డంగా ఉన్న భారీ వృక్షాన్ని తొలగించిన గ్రామస్తులు

చింతపల్లి: మండలంలో ఎర్రబొమ్మలు పంచాయతీ పరిధిలోని తెప్పలమామిడి గ్రామ సమీపంలో రోడ్డుకి అడ్డంగా పడిన భారీ వృక్షాన్ని గ్రామస్తుల సహకారంతో గురువారం తొలగించారు. ఇటీవల ఉగాది రోజున తెప్పలమామిడి గ్రామ సమీపంలో భారీ వృక్షం రోడ్డుకి అడ్డంగా పడి రాకపోకలకు అంతరాయం కలిగిన విషయం తెలిసిందే. ఈ వృక్షాన్ని తొలగించాలని అధికారులకు స్థానికులు తెలియజేసినా స్పందించక పోవడంతో ఎర్రబంద , తెప్పలమామిడి గ్రామస్తులతో స్థానిక ఎంపీటీసీ సభ్యుడు సెగ్గె సత్తిబాబు, మాజీ జెడ్పీటీసీ సెగ్గె కొండలరావుల సహకారంతో భారీ వృక్షాన్ని తొలగించేందుకు చర్యలు చేపట్టారు. దీంతో గురువారం మధ్యాహ్నం నుంచి ఈ మార్గం మీదుగా శరభన్నపాలెం, కేడీ పేట వెళ్లేందుకు మార్గం సుగమమైంది. అధికారులు స్పందించక పోయినా స్థానికులు సహాయంతో రాకపోకలకు సౌకర్యం కల్పించినందుకు ఆయా గ్రామస్తులకు వాహనచోదకులు, స్థానికులు కృతజ్ఞతలు తెలిపారు.

వలసగెడ్డలో ప్రతిధ్వనించిన రామనామం



స్వామి శ్రీనివాసానంద సరస్వతికి స్వాగతం పలుకుతున్న ఆలయ కమిటీ సభ్యులు తదితరులు

- వైభవంగా ఆలయ ప్రారంభోత్సవం
- భక్తిశ్రద్ధలతో సీతారామ లక్ష్మణ, ఆంజనేయ స్వామి విగ్రహాల ప్రతిష్ట
- ప్రత్యేక పూజలు, అభిషేకాలు, హోమాలు
- వెల్లివిరిసిన ఆధ్యాత్మికత
- తరలివచ్చిన భక్తులు



పూజలు చేస్తున్న భక్తులు

సీలేరు: గూడెం కొత్తవీధి మండలం దుప్పులవాడ పంచాయతీ వలసగెడ్డ అటవీ ప్రాంతంలో నూతనంగా నిర్మించిన రామాలయంలో గురువారం ఉదయం సీతారాముల విగ్రహ ప్రతిష్ట కార్యక్రమాలు, ఆలయ ప్రారంభోత్సవాలు ఘనంగా నిర్వహించారు. హైదరాబాదుకు చెందిన ముక్తేశ్వరరావు ఆధ్వర్యంలో వేదపండితులు కల్యాణ గురుస్వామి, దామోదరస్వామిలు గణపతి పూజ, సర్వదూపత్య హోమాలు, పీఠన్యాసము, యంత్రన్యాసం తదితర పూజా కార్యక్రమాలు జరిపారు. అనంతరం ఆలయంలో సీతారాముల విగ్రహాలను ప్రతిష్టించారు.

ఈ కార్యక్రమానికి రాష్ట్ర సాధుపరిషత్ అధ్యక్షుడు స్వామి శ్రీనివాసానంద సరస్వతి ముఖ్య అతిథిగా హాజరయ్యారు. ఈ సందర్భంగా ఆలయ నిర్మాణదాత ముక్తేశ్వరరావు, వేదపండితులు ఆయనను ఘనంగా స్వాగతం పలికారు. ఆలయంలో ప్రత్యేక పూజలు, హోమాలు నిర్వహించారు. ఆలయ ప్రాంగణం రామనామస్మరణతో మార్మోగింది. మధ్యాహ్నం సీలేరుకు చెందిన ఏపీ జెన్‌కో ఇంజినీరు బి.వి.ఎస్.సుబ్రహ్మణ్యం దంపతుల ఆర్థిక సహాయంతో భారీ అన్నదాన కార్యక్రమం నిర్వహించారు.

సీలేరుతో పాటు పరిసర గ్రామాల నుంచి అధిక సంఖ్యలో భక్తులు తరలివచ్చారు.

రోడ్డుకు అడ్డంగా నిలిచిన కంటైనర్

- ఆరుగంటల పాటు నిలిచిన వాహనాల రాకపోకలు
- స్పందించిన పోలీసులు
- ట్రాఫిక్ సమస్య పరిష్కారం



సీతగుంట సమీపంలో రోడ్డుకు అడ్డంగా నిలిచిన కంటైనర్

పెదబయలు: మండలం సీతగుంట గ్రామ సమీపంలో రోడ్డుకు అడ్డంగా కంటైనర్ నిలిచిపోవడంతో ఆరు గంటల పాటు ప్రయాణికులు అవస్థలు పడ్డారు. అనకాపల్లి జిల్లా అచ్యుతాపురం నుంచి పెయిటింగ్ లోడుతో ఒడిశా రాష్ట్రం కురుక్షేత్రం సమీపంలో అంబలి గ్రామానికి బయలుదేరింది. డ్రైవర్ జీపీఎస్ సాయంతో ముందుకు వెళ్తుండగా ప్రధాన దారి తప్పడంతో సీతగుంట గ్రామ సమీపంలోని ఓ చిన్న దారిలో వెళ్లిన వాహనాన్ని తిప్పే క్రమంలో నిలిచిపోయింది. దీంతో గురువారం ఉదయం 7.30 గంటల నుంచి మధ్యాహ్నం 1 గంట వరకు నిలిచిపోయింది. విషయం తెలుసుకున్న పోలీసులు సంఘటన స్థలానికి చేరుకొని శ్రమించి కంటైనర్‌ను పక్కకు తీయించి, ట్రాఫిక్ సమస్య లేకుండా చూశారు. అనంతరం కంటైనర్‌ను తనిఖీ చేసి, పెదబయలు వంతెను మీదుగా ఒడిశాకు పంపించారు.

సహజ ప్రసవాలే శ్రేయస్కరం

రంపచోడవరం: ప్రభుత్వ ఆస్పత్రిలో సహజ కాన్పులకే ప్రాధాన్యత ఇవ్వడం జరుగుతుందని రంపచోడవరం ఏరియా ఆస్పత్రి సూపరింటెండెంట్ డాక్టర్ శేషిరెడ్డి తెలిపారు. రంపచోడవరం ఏరియా ఆస్పత్రిలో గురువారం సహజ ప్రసవాలపై అవగాహన కార్యక్రమం నిర్వహించారు. సహజ కాన్పులు వల్ల తల్లికి, బిడ్డకు కూడా క్షేమం, దీని వల్ల ఇన్‌ఫెక్షన్ రేటు, సిజేరియన్ రేటు తగ్గువగా ఉంటుందన్నారు. సైకాలజిస్ట్ డాక్టర్ మోమినా, నర్సింగ్ సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

జెడ్పీ చైర్‌పర్సన్‌కు వినతి



జెడ్పీ చైర్‌పర్సన్ సుభద్రకు వినతిపత్రం అందజేస్తున్న ఇంజినీరింగ్ అసిస్టెంట్లు

ముంచంగిపుట్టు: అన్ని శాఖల పనులతో పని ఒత్తిడికి గురవుతున్నామని మండలంలో వివిధ గ్రామ సచివాలయాల్లో పనిచేస్తున్న ఇంజినీరింగ్ అసిస్టెంట్లు వాపోయారు. ఈ సందర్భంగా వారంతా మండల కేంద్రానికి గురువారం వచ్చిన జెడ్పీ చైర్‌పర్సన్ జల్లిపల్లి సుభద్రను 17 మంది ఇంజినీరింగ్ అసిస్టెంట్లు మర్యాదపూర్వకంగా కలిసి వినతి పత్రం అందజేశారు. తమ విధుల్లో భాగంగా పీఆర్, ఆర్‌డబ్ల్యూఎస్, ట్రైబల్ వెల్ఫేర్, ఎస్ఎంఐ, పీఐయూ, హౌసింగ్ శాఖల పనులు చేస్తున్నామని, వీటితో పాటు నాన్ టెక్నికల్ పనులు, సర్వేలు, పింఛన్లు పంపిణీ వంటి పనులు చేయిస్తున్నారన్నారు. అన్ని శాఖల పనులు ఒకే రోజు చేయాలని ఒత్తిడి వస్తుండడంతో ఏ పనిచేయాలో తెలియని పరిస్థితి నెలకొంటుందని, ఇబ్బందులు పడుతున్నామన్నారు. తమకు పని ఒత్తిడి తగ్గించేందుకు ఇంజినీరింగ్ శాఖాల పనులు మాత్రమే తమ చేత చేయించాలని వారు వినతిలో కోరారు. దీనిపై స్పందించిన జెడ్పీ చైర్‌పర్సన్ జల్లిపల్లి సుభద్ర మాట్లాడుతూ ఇంజినీరింగ్ అసిస్టెంట్లు పడుతున్న ఇబ్బందులను కలెక్టర్ దినేష్‌కుమార్ దృష్టికి తీసుకెళ్లి పరిష్కరించేదుకు కృషి చేస్తానని హామీ ఇచ్చారు.

పౌష్టికాహారంతోనే సంపూర్ణ ఆరోగ్యం



సామూహిక సీమంతాలు నిర్వహిస్తున్న సిబ్బంది

దుంబ్రిగుడ: మండలంలోని కిల్లోగుడ అంగన్‌వాడీ కేంద్రంలో సీడీపీవో నీలిమ ఆధ్వర్యంలో గురువారం సామూహిక సీమంతాలు, చిన్నారులకు అన్నప్రాశన కార్యక్రమాలు నిర్వహించారు. కార్యక్రమంలో పాల్గొన్నా సాగర పంచాయతీ ఎంపీటీసీ దేవదాసు, సర్పంచ్‌లు తదితరులు మాట్లాడుతూ గర్భిణులు పౌష్టికాహారం తీసుకోవాలని దీంతో సంపూర్ణ ఆరోగ్యం చేకూరుతుందన్నారు. అంగన్‌వాడీ కేంద్రాల ద్వారా అందిస్తున్న పౌష్టికాహారాన్ని సద్వినియోగం చేసుకోవాలని, ఆరోగ్యంపై ప్రత్యేక శ్రద్ధ తీసుకోవాలని సూచించారు. తక్కువ బరువు గల పిల్లలు పుట్టకుండా ఉండేలా చూసుకోవాలన్నారు. సూపర్‌వైజర్ వెంకటలక్ష్మి, శిరీష, అంగన్‌వాడీ వర్కర్ సీతమ్మ తదితరులు పాల్గొన్నారు.